సాక్షి సిద్దిపేట
బుధవారం । 7 । ఆగస్టు । 2024



'చేనేత'కు చేయూతేదీ?

చేనేత కార్మికులకు చేయూత కరువైంది. నాడు ప్రజాదరణతో విరాజిల్లి నేడు నిరాదరణతో కునారిల్లుతున్నారు. దీనస్థితిలో కాలం వెల్లదీస్తున్నారు. వివరాలు 8లో ▸



రామలింగారెడ్డి సేవలు మరువలేం

ఊపిరి ఉన్నంత వరకు పేదల కోసమే పరితపించిన వ్యక్తి రామలింగారెడ్డి అని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. వివరాలు 8లో ▸



నవోదయం.. ఆటల సంరంభం

అథ్లెట్ల పోరాటానికి వర్గల్ నవోదయ ముస్తాబైంది. బుధవారం నుంచి క్లస్టర్ స్థాయి పోటీలు క్రీడాభిమానులను కనువిందు చేయనున్నాయి. వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించండి

కేంద్రమంత్రికి కొత్త ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: విమానయాన సేవలు పెంపొందించి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడుకి విన్నవించారు. మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు. తెలంగాణలో అవసరమైన ప్రాంతాల్లో నూతన విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయాలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని విన్నవించానన్నారు. తన విన్నపానికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

డీఐఈఓగా రవీందర్‌రెడ్డి



సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా రవీందర్‌రెడ్డిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో పలువురు ప్రిన్సిపాల్స్ వివిధ కళాశాలలకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో కరీంనగర్ బాలికల కళాశాల నుంచి కోహెడ కళాశాలకు విచ్చేసిన సీనియర్ ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి నూతన డీఐఈఓగా నియామకమయ్యారు. గతంలో డీఐఈఓగా బాధ్యతలు నిర్వర్తించిన హిమబిందు సిద్దిపేట బాలికల కళాశాలకు బదిలీ అయ్యారు.

మల్లన్న ఆలయంలో ఉద్యోగుల బదిలీలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం దేవాదాయశాఖ కమిషనర్ హన్మంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఎలక్ట్రికల్ ఏఈ బి.అంజయ్య, జూనియర్ అసిస్టెంట్‌లు మాధవి, సందీప్‌లు యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి బదిలీపై వెళ్లారు. యాదగిరి గుట్టలో పనిచేస్తున్న ఎలక్ట్రికల్ ఏఈ ప్రభాకర్ రావు, జూనియర్ అసిస్టెంట్ నర్సింహులు, కొండగట్టు అంజనేయ స్వామి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న లక్ష్మీరాజ్యంలు కొమురవెల్లి మల్లన్న ఆలయానికి బదిలీపై వచ్చారు.

సీఐ, పీపీలకు డీజీపీ అభినందనలు



సీఐ, పీపీకి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందిస్తున్న డీజీపీ

సిద్దిపేటకమాన్: సీఐ పరశురామ్‌గౌడ్, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటలింగంను డీజీపీ జితేందర్, రాష్ట్ర పోలీసు అకాడమీ అదనపు డీజీపీ అభిలాష్‌బిస్త్ అభినందించారు. దుబ్బాకలో 2017లో జరిగిన ఓ హత్య కేసులో నేరస్తుడికి జీవితఖైదీ శిక్ష పడేలా కృషి చేసిన కేసు ఇన్వెస్టిగేషన్ అధికారి అప్పటి సీఐ అయిన పరశురామ్‌గౌడ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటలింగం తన వాదనలు వినిపించినందుకుగాను వీరిని డీజీపీ కార్యాలయంలో మంగళవారం సీపీ అనురాధ సమక్షంలో డీజీపీ అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

52 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 52మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. అలాగే నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 49మందిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మత్తుపదార్థాలను అరికట్టడంలో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాగరం.. జలసంబురం

చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్‌లోకి గోదావరి జలాలు పరవళ్లుతొక్కాయి. సాగర్ అడుగంటడం.. సాగుకు రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న క్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం స్పందించి మిడ్ మానేరు ద్వారా జిల్లాలోని రిజర్వాయర్‌లకు గోదావరి జలాల ఎత్తిపోత ప్రారంభించింది. దీంతో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి మేర్గు మహేష్‌ల ఆధ్వర్యంలో మంగళవారం రంగనాయక సాగర్ వద్ద ప్రత్యేక పూజలు చేసి సంబురాలు నిర్వహించారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట)



పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



రంగనాయక సాగర్‌లోకి గోదావరి పరవళ్లు

ఖాళీ స్థలాలతో కలవరం

నిత్యం దోమలతో సమరం
- రోగాలకు అవాసాలుగా మారిన ఓపెన్ ప్లాట్లు
- అధికారికంగా 1500 స్థలాల గుర్తింపు
- యజమానులకు నోటీసులు జారీ
- అయినా స్పందన కరువు
- మున్సిపాలిటీల్లో లోపిస్తున్న పారిశుద్ధ్యం

స్వచ్ఛ పట్టణాలుగా తీర్చిదిద్దే ప్రభుత్వ ప్రయత్నానికి ఓపెన్ ప్లాట్లు గుదిబండగా మారాయి. వర్షాకాలంలో ఖాళీ స్థలాలు దోమలకు అవాసంగా మారుతున్నాయి. ఖాళీ స్థలాల్లో చెత్త చెదారం, పిచ్చిమొక్కలు, పొదలు పెరిగి పారిశుద్ధ్యం కొరవడుతోంది. దీంతో ఖాళీ స్థల యజమానులకు నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో మున్సిపాలిటీల్లోని యంత్రాంగం దిక్కుతోచని స్థితికి గురవుతోంది.

– సిద్దిపేటజోన్



నివాసాల మధ్య నిలిచిన నీరు



పిచ్చిమొక్కలతో నిండిన ఖాళీ స్థలం

జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీల్లో అధికారికంగా సుమారు 1500కు పైగా ఓపెన్ ప్లాట్స్ ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విపరీతంగా పెరిగిపోయాయి. ఖాళీ స్థలాలు దోమలకు నిలయంగా మారి డెంగీ, మలేరియా లాంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్నాయి. పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో పెద్ద ఎత్తున మున్సిపాలిటీల్లో స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు కొత్త కాలనీలు ఏర్పడి పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన ఆయా మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్స్ సంఖ్య పెరుగుతూనే ఉంది. మున్సిపాలిటీల్లో వందల సంఖ్యలో ఖాళీ స్థలాలు ఉండటంతో వాటి నిర్వహణ పట్ల యజమానులు పట్టించుకోకుండా ఉండడంతో పిచ్చిమొక్కలు, పొదలు, చెత్త పెరిగి దోమలు వృద్ధిచెందుతున్నాయి. ఖాళీ స్థలం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమీప నివాస ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారు.

నోటీసులు జారీ ..

నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల వల్ల ఇబ్బందులు ఉన్నాయని ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు మున్సిపల్ యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు సంబంధించిన స్థల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త, చెదారం, పిచ్చి మొక్కలు, తొలగించి పరిశుభ్రంగా చేసుకోవాలి. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ లెక్కన సిద్దిపేటలో 250, గజ్వేల్‌లో 500, దుబ్బాకలో 300, హుస్నాబాద్‌లో 60, చేర్యాలలో 120 మందికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ వారి నుంచి స్పందన కానరాకపోవడంతో సీజనల్ వ్యాధుల కట్టడి సమస్యగా మారింది.

అధికారులకు అదనపు ఒత్తిడి..

ఖాళీ స్థలాల యజమానులు స్పందించకపోవడంతో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందే శుభ్రం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సమస్యను అధిగమించేందుకు బల్దియా ఈసారి కొత్త ప్రయోగం చేయాలని సంకల్పించింది. వనమహోత్సవంలో భాగంగా ఖాళీ స్థలంలో ప్రస్తుతం ఉన్న పిచ్చి మొక్కలు, చెత్త చెదారం తొలగించి మొక్కలు నాటాలని నిర్ణయించింది. ఈ మేరకు సంబంధించిన ఖాళీ స్థలాల యజమానులను ఇందులో భాగస్వామ్యం చేయాలని సంకల్పించింది.

చర్యలు తీసుకుంటాం



ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త, చెదారం, పొదలు తొలగించి, పారిశుద్ధ్యం మెరుగుపరచాలని యజమానులకు నోటీసులు జారీ చేశాం. స్పందించనట్లయితే ఖాళీ స్థలాల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టి వారి ద్వారా సంబంధించిన ఛార్జి వసూలు చేస్తాం. వనమహోత్సవం సందర్భంగా ఆ ఖాళీ స్థలంలో పండ్లు, కూరగాయలు, పూల మొక్కలు నాటాలని సూచించనున్నాం.

–నర్సయ్య, మున్సిపల్ కమిషనర్ గజ్వేల్



హుస్నాబాద్‌లో కొత్త చెరువును పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి

స్వచ్ఛదనం సక్సెస్ చేద్దాం

- భూములు కబ్జా చేస్తే చర్యలు
- మంత్రి పొన్నం ప్రభాకర్
- కొత్తచెరువును పరిశీలించిన మంత్రి, కలెక్టర్

హుస్నాబాద్: మన జీవితంలో స్వచ్ఛదనం, పచ్చదనం భాగం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని కొత్త చెరువు వద్ద మంగళవారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరితో కలిసి మంత్రి పాల్గొన్నారు. కొత్త చెరువును పరిశీలించి అక్కడ చేయాల్సిన పనులపై కలెక్టర్‌తో చర్చించారు. మంత్రి మాట్లాడుతూ మన ఇంటి పరిసరాలను ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో, పట్టణం, మనం నివసించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వీలైనంత వరకు స్వచ్ఛమైన గాలి, తాగేనీరు, వాతావరణం, మనం తినే ఆహారం కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు ఎవరు కబ్జా చేసినా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

స్వయంగా వచ్చి రైతుల సమస్యలు తెలుసుకుంటా..

హుస్నాబాద్‌రూరల్: ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని, గ్రామాలను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఐఓసీ కార్యాలయ సముదాయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ప్రగతి నివేదికలపై సమీక్షించారు. ఈ నెల 8 నుంచి రైతు వేదికల వద్దకు స్వయంగా వచ్చి రైతుల సమస్యలను తెలుసుకుంటానన్నారు. రైతు వేదిక వద్ద జరిగే సమావేశానికి మండలంలోని ప్రతి అధికారి రావాలని ఆదేశించారు. త్వరలోనే రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటామన్నారు. వచ్చే 50 రోజుల్లో 500 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏడు మండలాల అధికారులు పాల్గొన్నారు.

గద్దరన్నకు నివాళులు



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం, చాడ తదితరులు

హుస్నాబాద్: అన్యాయాన్ని ఎదిరించి పోరాడిన దీరుడు గద్దర్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్‌లో అమర వీరుల స్తూపం వద్ద ప్రజా గాయకుడు గద్దర్ ప్రథమ వర్ధంతి, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, ప్రజా ఉద్యమకారుడు జహీరొద్దీన్ అలీఖాన్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద అమరుల స్తూపానికి మంత్రి పొన్నం, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డిలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 34 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ స్తూపం నిర్మాణానికి గద్దర్ ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఆనాడు భూమి కోసం, భుక్తి కోసం విముక్తి కోసం పోరాటం జరిగితే, మలిదశ తెలంగాణ ఉద్యమంలో నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాటాలు జరిగాయన్నారు. నేడు పెన్ను గన్నుగా మారి.. ఓటే ఆయుధంగా మారితే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గద్దర్ ఆశయ సాధనకు కృషి

గజ్వేల్: పీడితుల కోసం నిరంతరం పోరాడిన ప్రజాగాయకుడు గద్దర్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మంగళవారం గద్దర్ వర్ధంతి సందర్భంగా గజ్వేల్‌లోని తన నివాసంలో కాంగ్రెస్ నేతలతో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ గద్దర్ ఆశయాల సాధనకు ముందుకు సాగుతామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు శివారెడ్డి, సర్దార్‌ఖాన్, నక్క రాములుగౌడ్, బోస్, నంగునూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

గుణాత్మకమైన విద్యను అందించండి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి గుణాత్మకమైన, నాణ్యమైన విద్యను అందించాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, చెప్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, రికార్డులను, విద్యార్థుల హాజరును, ఉపాధ్యాయుల పని తీరును ఆయన పరిశీలించారు. పాఠశాలల్లో నెలకొన్న ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన ప్రొ.జయశంకర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. జయశంకర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకశక్తిని వెలికి తీయడానికి ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. బోధనా పరమైన ఇబ్బందులు లేకుండా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మంచి పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, వార్షిక ఫలితాల్లో మంచి ప్రతిభ కనబర్చే విధంగా ఇప్పటి నుంచే ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జోగు ప్రభుదాసు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత, ఉపాధ్యాయులు, ఎమ్మార్పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ



బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ధనరాజ్

సిద్దిపేటకమాన్: జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ ధనరాజ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీఎంహెచ్ఓగా విధులు నిర్వహించిన డాక్టర్ శ్రీనివాస్ సాధారణ బదిలీల్లో భాగంగా నల్గొండకు బదిలీ అయ్యారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులలో సిబ్బంది సమయ పాలన పాటించాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

అధికారులు పరుగులు..

- పెద్దతండాలో వైద్య శిబిరం
- యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు
- యంత్రాంగం తీరుపై కలెక్టర్ సీరియస్

సాక్షి ఎఫెక్ట్



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

అక్కన్నపేట(హుస్నాబాద్): 'మంచం పట్టిన పెద్దతండా'... విజృంభిస్తున్న విషజ్వరాలు, ఊరంతా ఫీవర్ అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. కలెక్టర్ మనుచౌదరి సైతం అధికారుల నిర్లక్ష్యంపై సీరియస్ అయినట్లు సమాచారం. దీంతో మంగళవారం ఉదయమే వైద్య సిబ్బంది, మండల అధికారులు పెద్దతండా గ్రామానికి పరుగులు పెట్టారు. మండల వైద్యాధికారి రమ్య అధ్వర్యంలో వైద్యసిబ్బంది బృందం కలిసి ఇంటింటా జ్వర సర్వేను నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు ఇచ్చారు. అలాగే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యాలయం సమీపంలో మురుగు కాలువను ఎంపీడీఓ భానోతు జయరాం, ఎంపీఓ కవికుమార్ పరిశీలించారు. కాలువను త్వరగా శుభ్రం చేయించాలన్నారు. ఊరంతా ఫాగింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శి రజినిని ఆదేశించారు. అధికారులతో పాటు కాంగ్రెస్ మండల నాయకులు సైతం గ్రామానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. గిరిజనులకు అండగా నిలిచారు.

మెలకువలు పాటిస్తే గణితం సులభమే..

- బట్టీ చదువులకు స్వస్తి చెప్పండి
- శాస్త్రీయంగా ఆలోచించాలి
- విద్యార్థులతో కలెక్టర్ మనుచౌదరి



విద్యార్థుల ప్రయోగాలను పరిశీలించి వారితో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గణితం అంటే భయం వద్దని, మెలకువలు పాటిస్తే సులభమేనని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ముందుగా విద్యార్థుల హాజరు, వంటగది, సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ బట్టీ విధానం కాకుండా శాస్త్రీయంగా ఆలోచిస్తూ చదవాలన్నారు. ప్రతి సమస్యను సంపూర్ణంగా పరిష్కరించాలంటే శాస్త్రీయ దృక్పథం అవసరమన్నారు. చేస్తున్న ప్రయోగాలను నిశితంగా పరిశీలించి కొత్త తరం ఆవిష్కరణలు రూపొందించేలా శాస్త్రీయ ఆలోచన పెంపొందించుకోవాలని సూచించారు. ఇంగ్లిష్ రావాలంటే ప్రతిరోజు కచ్చితంగా ఆంగ్లంలోనే మాట్లాడాలన్నారు. ఇంగ్లీష్ న్యూస్ పేపర్ చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. జిల్లాలోని ఇతర ప్రభుత్వ పాఠశాలలో కూడా డిజిటల్ పద్ధతిని ఉపయోగించేందుకు కార్యాచరణ రూపొందిస్తామని కలెక్టర్ తెలిపారు. వంటగదిని పరిశీలించి వేయి మందికి పైగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేటప్పుడు పరిశుభ్రతకు, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో సదుపాయాలు కల్పిస్తాం

కోహెడరూరల్(హుస్నాబాద్): తంగళ్లపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ మనుచౌదరి మంగళవారం సందర్శించారు. మొదట పదో తరగతిలోకి వెళ్లి విద్యార్థులకు జీవశాస్త్రంపై ఉన్న పరిజ్ఞానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీలో అవసరమైన మౌలిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేఖ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బస్టాండ్‌లో చిన్నారులు

● వదిలివెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు




పటాన్‌చెరుటౌన్ : బస్టాండ్ ప్రాంగణంలో ఇద్దరు చిన్నారులను వదిలిపెట్టి వెళ్లిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ప్రవీణ్ రెడ్డి కథనం మేరకు.. పటాన్‌చెరు బస్టాండ్ ఆవరణలో సోమవారం సాయంత్రం బాబు(4), పాప(1) ఇద్దరు చిన్నారులను గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న స్వీపర్లు ఎవరైనా వస్తారోమో అని ఎదురుచూసి రాకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఇద్దరి పిల్లలను పోలీస్‌స్టేషన్ కు తీసుకొచ్చి విచారించినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. సంగారెడ్డి సీడబ్ల్యూసీ అధికారులకు సమాచారం ఇవ్వగా ఇద్దరు చిన్నారులను తీసుకెళ్లారు. పిల్లలను ఎవరు వదిలిపెట్టి వెళ్లారనే దానిపై దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక



నితీషను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొండపాక(గజ్వేల్): హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో 7వ తేదీన జరిగే పరుగు పందెం పోటీలకు కొండపాక మండలంలోని సిర్సనగండ్ల హైస్కూల్ విద్యార్థి దబ్బెట నితీష ఎంపికైంది. సిద్దిపేట అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో నిర్వహించిన అండర్-14 కేటగిరీలో 400 మీటర్ల పరుగు పందెం జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి బంగారు పతకం కైవసం చేసుకుంది. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్ పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఉప్పలయ్య, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదరి పరమేశ్వర్, కార్యదర్శి వెంకటస్వామి అభినందించారు.

రుణమాఫీ కాగానే పీఆర్సీ

ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి



కిషన్‌ను సన్మానిస్తున్న రఘోత్తం రెడ్డి

పాపన్నపేట(మెదక్): రుణ మాఫీ చెల్లింపులు పూర్తి కాగానే ఉద్యోగుల పీఆర్సీ వస్తుందని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం పాపన్నపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సీహెచ్ కిషన్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆగస్టు 15 వరకు రుణమాఫీ పూర్తి అవుతుందన్నారు. తర్వాత ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన పీఆర్సీ వస్తుందన్నారు. దీపావళి కానుకగా పెండింగ్ డీఏలు వస్తాయన్నారు. టీపీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు మాట్లాడుతూ.. టీచర్ల సమస్యల పరిష్కారానికి తమ యూనియన్ చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. సీపీఎస్ రద్దుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, డీఈఓ రాధాకిషన్ మాట్లాడారు.ఈ సందర్భంగా కిషన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నీల కంఠం, పీఆర్టీయూ నాయకులు సబ్బని శ్రీనివాస్, సుంకరి క్రిష్ణ, పంతుల రాజు, వెంకట్రాంరెడ్డి, హెచ్ఎంలు మహేశ్వర్, సురేందర్‌గౌడ్, అంజాగౌడ్ పాల్గొన్నారు.

బంగారం స్వాధీనం



మునిపల్లి(అందోల్): మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ముంబాయి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సును తనిఖీ చేయగా ముంబాయికి చెందిన నగల వ్యాపారి చందరేశ్ చకారియా వద్ద 4,840 గ్రాముల బంగారం లభించింది. సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో బంగారం, నగల వ్యాపారిని అప్పగించినట్లు డీటీఎఫ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ శంకర్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరుణ, జ్యోతి, అంజిరెడ్డి, రాజేశ్, శివ, నవ్యజ్యోతి పాల్గొన్నారు.

నాడు వస్త్రకాంతులు.. ప్రస్తుతం దీన బతుకులు

- చేనేత కార్మికులకు ఉపాధి కరువు
- మూలనపడుతున్న మగ్గాలు
- దయనీయ స్థితిలో కుటుంబాలు
- సిద్దిపేటలో ప్రసిద్ధి చెందిన గొల్లభామ చీర
- దుబ్బాకలో లెనిన్ కాటన్ చీరలు
- నేడు జాతీయ చేనేత దినోత్సవం



మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు

'చేనేత'కు చేయూతేదీ?

నాడు చేనేత వస్త్రాలకున్న ప్రజాదరణతో వెలుగులు విరాజిల్లి ఉపాధి పొందిన నేత కార్మికులు నేడు నిరాదరణతో కునారిల్లుతున్నారు. ఇంటింటికీ ఒకటి రెండు మగ్గాలతో నిరంతరం పనిచేసి గొప్పగా బతికి పది మందికి పని కల్పించిన నేతన్నలు నేడు దీనస్థితిలో బతుకున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా పథకాలు క్షేత్రస్థాయిలో చేరడం లేదని సిద్దిపేటకు చెందిన చేనేత కార్మికులు అంటున్నారు. 7వ తేదీన (బుధవారం) జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

– సిద్దిపేట జోన్ / దుబ్బాక

సిద్దిపేట చేనేత వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. దాదాపు 2 వేల కుటుంబాలు చేనేత వృత్తి పై ఆధారపడి జీవిస్తున్నాయి. కానీ ప్రస్తుతం చేనేత కార్మికులకు పనులు లేక వీరంతా దీనావస్థలో బతుకుతున్నారు. సిద్దిపేటకు చెందిన గొల్లభామ చీర ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చింది. సిద్దిపేటకు చెందిన చేనేత కార్మికులు వీరబత్తిని సోమయ్య, రచ్చ నర్సయ్య కులవృత్తి పైనే ఆధారపడి జీవించేవారు. 70 ఏళ్ల కిందట ఒక రోజు ఇంటి ఎదుట నుంచి తలమీద పాలకుండ, చేతిలో పెరుగు గురిగి(ముంత) పట్టుకొని నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ నీడను చూసి వారిలో 'గొల్లభామ' చీర ఆలోచన పురుడు పోసుకుంది. ఆ దృశ్యాన్ని నేత పని ద్వారా చీరల మీద చిత్రీకరించాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆలోచనలకు పదును పెట్టి గొల్లభామ చీరలను నేసేందుకు అవసరమైన ప్రత్యేక సాంచాను తయారు చేసుకున్నారు. అలా ఆవిష్కృతమైన అద్భుతమే గొల్లభామ చీరగా ప్రసిద్ధి పొందింది.

యునెస్కో నివేదికలో గుర్తింపు

గొల్లభామ చీరకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. 21 శతాబ్దం కోసం తయారు చేసిన చేనేత వస్త్రాలు సంప్రదాయ భారతీయ వస్త్రాల సంరక్షణ పేరిట 2022 యునెస్కో విడుదల చేసిన నివేదికలో చోటు దక్కింది. జాగ్రఫికల్ ఇండికేషన్ అప్లికేషన్(జీఐఏ) గుర్తించింది. జీఐఏ జాబితాలో 188 వరుస సంఖ్యలో నిలిచింది. గొల్లభామ చీర ఎందరో ప్రముఖుల్ని ఆకట్టుకున్నాయి. మాజీ రాష్ట్రపతులు ఈ చీరల గురించి తెలుసుకొని ప్రత్యేకంగా తెప్పించుకున్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి చీరను బహూకరించారు. గొల్లభామ చీరలను చూసేందుకు చేనేత బ్రాండ్ అంబాసిడర్ హోదాలో సినీ నటి సమంత సిద్దిపేటకు వచ్చింది. చీరలను నేసే తీరును చేనేత కార్మికులను అడిగితెలుసుకుంది.



దుబ్బాక లెనిన్ చీరలు

అయోధ్య నుంచి ఆర్డర్లు

దుబ్బాకలో గతంలో గడియారం అంచు చీర, చిట్కీతోపాటు పలు రకాల చీరలను నేసేవారు మారుతున్న కాలానికి అనుగుణంగా దుబ్బాక హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ ప్రొడ్యూసర్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో లెనిన్ చీరలను నేయడం ప్రారంభించారు. 80-80, 100-80 లినెన్ యారన్‌లో సన్నసాదాతోపాటు, ఇక్కత్ చీరలకు శ్రీకారం చుట్టారు. ఈ చీరను టై అండ్ డై విధానంలో ఇక్కత్ చీరను దుబ్బాకలో నేస్తున్నారు. దీని తయారీకి పూర్తిగా బెల్జియం లెనిన్ 80లీ ఉపయోగిస్తున్నారు. 16 డిసెంబర్ 2022న దేశ రాజధాని ఢిల్లీలో విరాసత్ పేరిట చేనేత చీరల పండుగను నిర్వహించారు.ఇందులో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 70 చీరలు ప్రదర్శనలో దుబ్బాకకు చెందిన లెనిన్ చీర ఎంపికైంది. అయోధ్యలోని బాల రాముడికి లెనిన్ ఇక్కత్ చీరతో ఎంతో అందంగా ముస్తాబు చేయడంతో మరిన్ని చీరలకు అయోధ్య నుంచి ఆర్డర్‌లు వచ్చాయి.

అందని పథకాలు

జాకాట్ మగ్గాలపై నేస్తుండటంతో చీర ధర పెరుగుతుంది. గొల్లభామ చీరను నేసేందుకు సుమారుగా రెండు రోజులు పడుతుంది. దీని ధర రూ.1,200 నుంచి ప్రారంభమవుతుంది. ప్రభుత్వం సహకారం అందిస్తే కొంత ధరలు తగ్గే అవకాశాలున్నాయి. అదే ప్రభుత్వం చేనేత వస్త్రాలు కొనుగోలు చేయడంతోపాటు, చేయూతను అందిస్తే కార్మికులకు ఉపాధి లభించే అవకాశాలున్నాయి. చేనేత మగ్గాలు నేసేందుకు కొత్త వారు ఎవరూ రావడం లేదు. పాత వారు ఉన్న వరకే నేసే అవకాశం ఉంటుంది. రాను రానూ అంతరించి పోయే ప్రమాదం ఉండే అవకాశాలున్నాయి. అలాగే, ఎలాంటి పథకాలు నేత కార్మికులకు అందడం లేదు.

నేడు వేడుకలు

సిద్దిపేటజోన్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్ భవన్‌లో బుధవారం ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా వివిధ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు కలెక్టర్ మను చౌదరి చేతుల మీద బహుమతులు అందజేస్తారని తెలిపారు. చేనేత రంగంలో ప్రతిభ చూపిన వారిని ప్రభుత్వం పక్షాన సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు చేనేత వాక్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

"40 ఏళ్ల నుంచి మగ్గం నేస్తున్న..



ఇప్పుడు నా వయస్సు 64 ఏళ్లు. 40 ఏళ్ల నుంచి మగ్గం నేస్తున్న.. చిట్కి, గడియారం అంచుతోపాటు గతంలో చాలా రకాల చీరలు నేసిన. ఇప్పుడు లెనిన్ ఇక్కత్ చీరలు నేస్తున్న. ప్రభుత్వం చేనేత కార్మికులకు తగిన ప్యాకేజీ ఇచ్చి ఆదుకుంటే అందమైన రకరకాల చీరలు నేసే ఎంతో నైపుణ్యం ఉన్న దుబ్బాక చేనేత కార్మికులకు కార్మికులకు ఉపాధి లభిస్తుంది.

– కూరపాటి బాలరాజు, దుబ్బాక

భారంగా కుటుంబ పోషణ



కుటుంబ పోషణ భారం అవుతోంది. చేతి నిండా పని ఉంటే బాగుంటుంది. ప్రభుత్వం నుంచి సహాయం అందలేదు. ఏడాదిగా ఎగుమతులు లేవు. ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి. ప్రభుత్వం చేయూతను అందించాలి.

– నాగభూషణం, సిద్దిపేట చేనేత సహకార సంఘం"

ఆటో బోల్తా : ఇద్దరు మృతి



మల్లేశం (ఫైల్)



యూసుఫ్ (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): ఆటో బోల్తా పడి ఇద్దరు మృతి చెందిన ఘటన హత్నూర మండలం తురకల ఖానాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్ చెరువు మండలం పెద్ద కంచర్ల గ్రామానికి చెందిన గొల్ల మల్లేశం(47)ఆటోలో సోమవారం ఉదయం ఇంటి నుంచి బంధువుల వద్దకు మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికొస్తున్నాడు. మార్గమధ్యలో దౌల్తాబాద్ గ్రామానికి చెందిన పెద్దకటిక యూసుఫ్(51) బేగంపేట గ్రామానికి వెళ్తూ మల్లేశం ఆటో ఎక్కాడు. హత్నూర మండలం తురకల ఖానాపూర్ గ్రామ శివారులోకి వెళ్లగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మల్లేశం రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెతుకుతూ దౌల్తాబాద్ వైపు వస్తుండగా ఆటో రోడ్డు పక్కన బోల్తా పడి కనిపించింది. అందులో చూసేసరికి ఇద్దరు మృతి చెంది ఉన్నారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి ..

చిన్నకోదూరు(సిద్దిపేట): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రామునిపట్ల వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నంగునూరు మండలం తిమ్మాయపల్లి గ్రామానికి చెందిన చెట్టబోయిన కనకయ్య(55)కు వివాహం జరిగిన కొద్ది నెలల్లోనే భార్య విడిచిపెట్టి పోయింది. దీంతో కనకయ్య సిద్దిపేటలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయాడు. సోమవారం రాత్రి మద్యం సేవించి రామునిపట్ల వైపు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.



దెబ్బతిన్న ఆటోను పరిశీలిస్తున్న ఎస్ఐ

58 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

తూప్రాన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. నమ్మదగిన సమాచారం మేరకు టోల్‌ప్లాజా వద్ద రెవెన్యూ అధికారులతో కలిసి మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నాం. మేడ్చెల్ వైపు నుంచి మహారాష్ట్రకు లారీలో 30 క్వింటాళ్ల రేషన్ బియాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించాం. బియ్యం లారీని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్‌కు అక్రమంగా 28 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం రావడంతో సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ సాదిక్ వెళ్లి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుకోవడంతో తమకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. లారీతోపాటు డ్రైవర్ సుఖ్‌దేవ్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వివాహేతర సంబంధంతోనే హత్య

- ఆరుగురు నిందితుల అరెస్ట్
- 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీఐ రేణుక



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రేణుక

అల్లాదుర్గం(మెదక్): వివాహేతర సంబంధం కారణంగానే ముస్లాపూర్ గ్రామానికి చెందిన చిత్తరి బేతయ్యను హత్య చేశారని సీఐ రేణుక తెలిపారు. మంగళవారం నిందితులను అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన చిత్తరి బేతయ్య (40) కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. అదే కాలనీకి చెందిన దాదయ్య అనే వ్యక్తి భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం దాదయ్య తెలియడంతో జూన్ 22న మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతికి కారణం బేతయ్యనే అని దాదయ్య కుటుంబ సభ్యులు తరచూ గొడవ పడేవారు. దీంతో బేతయ్య గ్రామం విడిచి పక్క గ్రామమైన గడిపెద్దాపూర్‌లో ఉంటూ గొర్రెలను మేపుతున్నాడు. ఈ క్రమంలో ఎలాగైనా అతడిని అంతమొందించాలని దాదయ్య కుటుంబ సభ్యుడు పోచయ్య ప్లాన్ వేశాడు. ఈనెల 4న బేతయ్య గడిపెద్దాపూర్ గ్రామ శివారులో గొర్రెలు మేపుతుండగా పోచయ్య, మరో వ్యక్తి మల్లేశంతో కలిసి బేతయ్యపై గొడ్డలితో దాడి చేసి హత్య చేశారు. మరుసటి రోజు మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వివాహేతర సంబంధం కారణంగా జరుగుతున్న గొడవలను తెలుసుకొని పోలీసులు దాదయ్య కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకొని విచారించారు. హత్యకు కారణమైన పోచయ్య, మల్లేశం, రాజు, అంబయ్య, సిద్దయ్య, రమేశ్‌లు విచారణలో నేరం ఒప్పుకున్నారు. వెంటనే ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మహిళా కళాశాలలకు అనుబంధంగా..

- మరో వసతి గృహాన్ని ఏర్పాటు చేయండి
- యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి



వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గజ్వేల్ పట్టణ కేంద్రంలోని డిగ్రీ, జూనియర్ మహిళా కళాశాలలకు అనుబంధంగా మరో వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని, దీంతో అనేక మంది పేద విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి అన్నారు. బుధవారం ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా అధికారి కవితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. పట్టణంలోని మహిళా కళాశాలకు అనుబంధంగా వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రాంతానికి చెందిన అనేక మంది విద్యార్థినీలు ఆర్టీసీ బస్సుల ద్వారా గ్రామాల నుంచి గజ్వేల్ పట్టణ కేంద్రానికి వస్తున్నారన్నారు. దూర ప్రాంతాల వారు గజ్వేల్ పట్టణంలో రూమ్‌లు కిరాయికి తీసుకొని ఆర్థికంగా చితికి పోతున్నారన్నారు. గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్‌లో 250కి పైగా విద్యార్థినీలు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. కానీ కేవలం 40 మంది విద్యార్థినీలకు మాత్రమే వసతి గృహంలో ఉండేందుకు వీలు కల్పించారన్నారు. దీంతో మిగితా వారు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరో వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మధు, వినయ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రామలింగారెడ్డి సేవలు మరువలేం

మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత భూంరెడ్డి



రామలింగారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ వనిత, బీఆర్ఎస్ నాయకులు

దుబ్బాక: నాలుగు సార్లు ఎమ్మెల్యేగా కొన ఊపిరి వదిలేంత వరకు పేద ప్రజల కోసమే పరితపించిన గొప్ప నేత సోలిపేట రామలింగన్న అని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు రామలింగన్న, సతీమణి సుజాతక్క, కుమారుడు సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం రామలింగారెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా దుబ్బాక మున్సిపాల్టిలోని డబుల్ బెడ్రూం కాలనీ వద్ద, స్వగ్రామం చిట్టాపూర్‌లోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు, కుటుంబసభ్యులు నివాళులర్పించారు. అలాగే నియోజకవర్గంలోని గ్రామగ్రామానా రామలింగారెడ్డి వర్ధంతి సభలను నిర్వహించి ఆయన చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నక్సలైట్‌గా, జర్నలిస్టుగా, నాలుగు పర్యాయాలు శాసనసభ్యుడిగా ఉండి కూడా అత్యంత సాధారణ జీవితం గడిపిన గొప్ప నేత రామలింగన్న అన్నారు. రామలింగన్న సేవలు మరువలేమని, ఆయన ఆశయాల సాధన కోసం నిరంతరం పాటుపడుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, అభిమానులు ఆస స్వామి, పర్స కృష్ణ, పడాల నరేశ్, ర్యాకం శ్రీరాములు, మూర్తి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రాజమౌళి, వంశీ కృష్ణా గౌడ్, బానాల శ్రీనివాస్, కాల్వ నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రోహిత్ అంత్యక్రియలు

నివాళులర్పించిన జనగామ ఎమ్మెల్యే పల్లా



రోహిత్ తల్లిదండ్రులను ఓదార్చుతున్న పల్లా

మద్దూరు(హుస్నాబాద్): అమెరికాలో 15 రోజుల కిందట మృతి చెందిన సాయి రోహిత్ మృతదేహం మంగళవారం స్వగ్రామమైన కూటిగల్ చేరుకుంది. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి జూలై 24న రోహిత్ మృతి చెందిన విషయం తెలిసిందే. సుమారు రెండు వారాల తర్వాత గ్రామానికి చేరుకోవడంతో మృతదేహాన్ని చూడటానికి బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో వచ్చారు. మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. చెట్టంత కొడుకు విగతజీవిగా ఇంటికి తిరిగి వస్తాడని తాము ఏనాడు అనుకోలేదని తల్లిదండ్రులు విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, దూల్మిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

నవోదయం.. ఆటల సంరంభం

- నేటి నుంచి క్లస్టర్‌స్థాయి పోటీలు
- తరలిరానున్న వివిధ జిల్లాల నవోదయ విద్యార్థులు
- పోటీల నిర్వహణకు అంతా సిద్ధం

వర్గల్(గజ్వేల్): అథ్లెట్ల పోరాటానికి వర్గల్ నవోదయ ముస్తాబైంది. బుధవారం నుంచి రెండు రోజులపాటు జరిగే క్లస్టర్ స్థాయి పోటీలు క్రీడాభిమానులను కనువిందు చేయనున్నాయి. రాష్ట్రంలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వరంగల్‌తోపాటు ఆతిథ్య వర్గల్(మెదక్) నవోదయ విద్యాలయ నుంచి దాదాపు 110 మంది క్రీడాకారులు పాల్గొంటారు. రీజినల్ మీట్‌కు ఎంపిక కావడం లక్ష్యంగా అథ్లెటిక్స్‌లో తమ సత్తా చాటనున్నారు.

స్టేడియం సిద్ధం

టోర్నీ నిర్వహణ కోసం వర్గల్ నవోదయలోని 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌తో కూడిన విశాలమైన స్టేడియం సిద్ధం చేశారు. డిస్కస్, హామర్ త్రోల కోసం కేజీను రెడీ చేశారు. అథ్లెటిక్ టోర్నీకి సూచనగా స్టేడియం చుట్టూ రంగురంగుల జెండాలు పాతించారు. స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.



పోటీలకు ముస్తాబైన నవోదయ స్టేడియం

మూడు విభాగాల్లో పోటీలు

క్లస్టర్ స్థాయి అథ్లెటిక్ పోటీలు మూడు విభాగాలుగా నిర్వహించనున్నారు. అండర్-14, అండర్-17, అండర్-19 బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తారు. రన్నింగ్, హర్డిల్స్, హైజంప్, లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్, వాకింగ్ తదితర 84 అంశాల్లో పోటీలు జరుగుతాయి. ఆయా క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని మెదక్ క్లస్టర్(వర్గల్) తరఫున రీజియన్ లెవెల్ అథ్లెటిక్ మీట్ కోసం ఎంపిక చేస్తారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

వర్గల్ నవోదయలో ఉదయం 10 గంటలకు అథ్లెటిక్ పోటీల ప్రారంభోత్సవం జరుగుతుంది. స్థానిక తహసీల్దార్ ముఖ్య అతిథిగా హాజరై టోర్నీ ప్రారంభిస్తారు. టోర్నీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. టోర్నీ సందర్భంగా వివిధ నవోదయ విద్యాలయాల క్రీడాకారులు, ఎస్కార్ట్ టీచర్లకు బస ఏర్పాటు చేశాం.

– రాజేందర్, నవోదయ ప్రిన్సిపాల్, వర్గల్

కుక్కల దాడిలో 81 గొర్రెలు మృతి



గొర్రెల వద్ద రోదిస్తున్న చంద్రయ్య, కొమురయ్య

మద్దూరు(హుస్నాబాద్): కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మండల కేంద్రం, గ్రామానికి చెందిన నంగి చంద్రయ్య, నంగి కొమురయ్య సోదరులు తమకు ఉన్న గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి రోజు మాదిరిగానే గొర్రెలను దొడ్డిలోకి పంపించి ఇంటికెళ్లారు. మంగళవారం ఉదయం దొడ్డి వద్దకు వచ్చి చూడగా గొర్రెలు విచ్చలవిడిగా పడి ఉన్నాయి. కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందినట్లు గుర్తించి బోరున విలపించారు. 81 గొర్రెలు మృతి చెందడంతో సుమారు రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని వాపోయారు. గొర్రెల, మేకల పెంపకదారుల సంఘం జిల్లా డైరెక్టర్ ఆలేటి యాదగిరి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

పార్ట్‌టైం జాబ్ పేరుతో మోసం

రూ.5.58 లక్షలు పోగొట్టుకున్న ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ ప్రైవేట్ ఉద్యోగి డబ్బులు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ తేజ కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి జూలై 13వ తేదీన పార్ట్‌టైం జాబ్ అంటూ వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతడికి వ్యాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించాడు. పలు దఫాలుగా మొత్తం రూ.5.58 లక్షలు చెల్లించాడు. చివరగా నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించ లేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.